ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
గురువారం 20-06-2024 4 PM

# నగల దుకాణంలో చోరీ..

## యజమానిని కత్తితో పొడిచి నగదుతో పరారైన దుండగులు



**మేడ్చల్, జూన్ 20 (ప్రజాస్వరం):** పట్టపగలే దొంగలు బరితెగించారు. జ్యువెలరీ షాపులో చొరబడి యజమానిని కత్తితో పొడిచి డబ్బులు ఎత్తుకెల్లారు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మేడ్చల్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ పక్కన గల జగదాంబ జ్యువెలర్స్ షాప్‌కు గురువారం మధ్యాహ్నం 1.15 గంటల ప్రాంతంలో పల్సర్ బైక్ మీద ఇద్దరు దుండగులు వచ్చారు. చాకుతో షాప్ యజమాని శేషరాంను పొడిచి డబ్బులు ఎత్తుకెల్లారు. వీరిలో ఒక వ్యక్తి హెల్మెట్ ధరించగా, మరో వ్యక్తి ముసుగు వేసుకొని వచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలను సేకరిస్తున్నారు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ సత్యనారాయణ దర్యాప్తు చేపట్టారు. దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



# రూ.341 కోట్లు కట్టండి




## బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి మైనింగ్ అధికారుల నోటీసులు

- పటాన్‌చెరు ఎమ్మెల్యే కుటుంబంపై అక్రమ మైనింగ్ ఆరోపణలు
- మహిపాల్‌రెడ్డి, బంధువుల నివాసాల్లో ఏకకాలంలో సోదాలు
- విలువైన పత్రాలను స్వాధీనం చేసుకున్న అధికారులు
- గతంలో ఇదే కేసులో మహిపాల్ సోదరుడు మధుసూదన్ రెడ్డి అరెస్ట్
- గులాబీ పార్టీలో కలకలం..

హైదరాబాద్, జూన్ 20 (ప్రజాస్వరం): తెలంగాణలో ఈడీ సోదాలు మరోసారి కలకలం రేపుతున్నాయి. ఎన్నికల ముందు వరకు ఐటీ, ఈడీ సోదాలతో తెలంగాణ రాజకీయం వేడెక్కిన విషయం తెలిసిందే. ఎన్నికలు పూర్తైన తర్వాత కూడా ఈడీ సోదాలతో తెలంగాణ రాజకీయం ఆసక్తిరేపుతోంది. తాజాగా పటాన్ చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఇంట్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. గురువారం తెల్లవారుజామున 4 గంటల నుంచి మొత్తం మూడు చోట్ల 40 అధికారులు తనిఖీలు నిర్వహించారు. మహిపాల్ రెడ్డి బంధువులకు రియల్ ఎస్టేట్స్, మైనింగ్ ఇంకా ఎన్నో బిజినెస్ లు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. వీటిలో మహిపాల్ రెడ్డి కూడా వాటా ఉందని ఆరోపణలు వెల్లువెత్తడంతో ఈడీ రైడ్స్ చేపట్టినట్లు తెలుస్తోంది. నిజాంపేటలోని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇంట్లోనే కాకుండా.. నిజాంపేటలోని వారి బంధువుల ఇళ్లలో కూడా సోదాలు చేపట్టారు. గతంలో రూ.341 కోట్లు చెల్లించాలని మైనింగ్ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఇదే కేసులో గతంలో గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డి అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. కాగా ఓ ఖరీదైన కారును గుర్తించడంతోపాటు, విలువైన పత్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సీనరేజీ, పెనాల్టీ కలిపి గతంలో మధుసూదన్‌రెడ్డి గతంలో 3 వందల 41 కోట్లు చెల్లించాలని మైనింగ్ అధికారులు నోటీస్ ఇచ్చారు. కాగా ఈడీ సోదాల విషయం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ పార్టీలో కలకలంరేపుతోంది.

### పన్నుల ఎగవేతే కారణం!

భూగర్భ గనులశాఖకు భారీగా సీనరేజ్ నిధులు ఎగవేసినట్లు ఆరోపణలు రావడంతో ఈడీ సోదాలు చేసినట్లు తెలుస్తోంది. మధుసూదన్ రెడ్డి బినామీ పేర్లతో వ్యాపారం చేస్తున్నట్లు ఈడీ గుర్తించింది. 72.8 లక్షల మెట్రిక్ టన్నుల మెటల్ తవ్వేసి కేవలం 40. 8 లక్షల మెట్రిక్ టన్నులకే సీనరేజ్ చెల్లించినట్లు తెలుస్తోంది. గతంలో లక్డారం గనుల వ్యవహారంలో వీరిపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఈ కేసు ఆధారంగానే ఈడీ సోదాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. సోదాల సమయంలో గూడెం మహిపాల్ రెడ్డి సోదరుల ఇళ్ల వద్ద కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటుచేశారు. మరోవైపు మహిపాల్ రెడ్డి ఇంటికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివస్తున్నారు. వారిని అదుపు చేసేందుకు కేంద్రబలగాలతో భద్రత ఏర్పాటుచేశారు. ఇదిలా ఉండగా మహిపాల్ రెడ్డి అల్లుడు తాజాగా రూ.3కోట్ల ఖరీదైన విలాసవంతమైన కారు కొన్నట్లు సమాచారం.



## నిరుద్యోగులకు న్యాయం చేయాలి

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**బండిని కలిసిన గ్రూప్ -1 అభ్యర్థులు**

కరీంనగర్, జూన్ 20 (ప్రజాస్వరం): గ్రూప్ 1 అభ్యర్థుల డిమాండ్ న్యాయమైనదని, నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయంచేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రిలిమ్స్ నుంచి 1:100 చొప్పున మెయిన్స్ కు ఎంపిక చేయాలని కోరారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను గ్రూప్-1 అభ్యర్థులు కలిశారు. గ్రూప్-1 మెయిన్స్ కోసం ప్రిలిమ్స్ నుంచి 1:100 చొప్పున ఎంపిక చేసేలా చూడాలని నిరుద్యోగులు కోరారు. నాలుగేళ్లలో మూడుసార్లు గ్రూప్ 1 పరీక్షలను రద్దు చేయడం వల్ల నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరిగిందని నిరుద్యోగులు తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 1:100 చొప్పున మెయిన్స్ కు ఎంపిక చేస్తామని గత ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చిన విషయాన్ని సైతం నిరుద్యోగులు గుర్తు చేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి నిరుద్యోగులకు న్యాయం జరిగేలా చూస్తానని బండి సంజయ్ హామీ ఇచ్చారు.




నీట్ పరీక్షను రద్దు చేయాలని హనుమకొండలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

# నీట్ పేపర్ లీక్ నిజమే..

- పరీక్షకు ఒకరోజు ముందే ప్రశ్నాపత్రం అందింది
- విచారణలో కీలక విషయాలు వెల్లడించిన నిందితులు
- కేంద్ర దర్యాప్తు సంస్థతో ఎంక్వయిరీకి నో చెప్పిన సుప్రీంకోర్టు..
- కౌన్సెలింగ్ నిలిపివేతకు నిరాకరణ..

**ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు | దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన లీకేజీ అంశం**

ఢిల్లీ, జూన్ 20 (ప్రజాస్వరం): దేశవ్యాప్తంగా వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ ఎగ్జామ్-2024 పేపర్ లీక్ అయినట్లు కన్ఫర్మ్ అయింది. ఇదే విషయాన్ని అరెస్టు అయిన నలుగురు ఒప్పుకున్నారు. పోలీసు విచారణ ఈ విషయం వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. నీట్ పేపర్ లీకేజీ కేసులో అభిలాష్, ధనాపూర్ మున్సిపల్ కౌన్సిల్ కు చెందిన జూనియర్ ఇంజనీర్ సికిందర్ యాదవ్ మరో ఇద్దరు నితీష్ కుమార్, అమితానందను బీహార్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. పరీక్షకు ముందు రోజు రాత్రి సమాధానాలతో సహా పేపర్ తమ చేతికి అందిందని అనురాగ్ పోలీసుల విచారణలో కీలక విషయాలు వెల్లడించారు. పరీక్ష ముందు రోజునే తమకు ప్రశ్నపత్రం వచ్చింది. సమాధానాలు గుర్తుపెట్టుకున్నాం. మరుసటి రోజు ఎగ్జామ్లో అవే ప్రశ్నలు వచ్చాయి. ఎగ్జామ్ తర్వాత మమ్మల్ని పోలీసులు పోలీసులు అరెస్టు చేశారని నిజం ఒప్పుకున్నారు. నీట్ ప్రశ్నాపత్రానికి ఒక్కొక్కరికి 30 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని అమిత్ తనతో చెప్పారని సికిందర్ ఆరోపించారు. జూన్ 4న రాత్రి తమకు పేపర్ అందిందని ఆన్సర్లు బట్టిపట్టి మరుసటి రోజు ఎగ్జామ్లో రాసినట్లు ఒప్పుకున్నారు.

### కౌన్సిలింగ్ నిలిపివేయలేం..

మరోవైపు నీట్ ఎగ్జామ్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలన్న విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. కేంద్ర దర్యాప్తు సంస్థతో ఎంక్వయిరీకి నో చెప్పింది. అలాగే నీట్ 2024 కౌన్సిలింగ్‌ను నిలిపివేయడానికి నిరాకరించింది. ఈ వ్యవహారంపై దాఖలైన నాలుగు పిటిషన్లపై బుధవారం విచారణ చేపట్టింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి నోటీసులు జారీ చేసింది. దీనిపై రెండు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే నెల ఎనిమిదికి వాయిదా వేసింది.

## రేపు కేబినెట్ భేటీ..

- రైతు సమస్యలే ప్రధాన ఎజెండా..
- పలు కీలక నిర్ణయాలు ప్రకటించే చాన్స్

**హైదరాబాద్, జూన్ 20 (ప్రజాస్వరం):** తెలంగాణ కేబినెట్ శుక్రవారం భేటీ కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సాయంత్రం 4 గంటలకు మంత్రులు సమావేశం కానున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ కేబినెట్ భేటీలో ప్రధానంగా రుణమాఫీ, రైతుభరోసా విధి విధానాలపై చర్చించే అవకాశం ఉంది. పంటల బీమా అర్హతలపై మంత్రుల బృందం చర్చించనున్నారని సమాచారం. బడ్జెట్ సమావేశాలు, రాష్ట్ర కొత్త చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహంపై కేబినెట్‌లో చర్చించనున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు ధాన్యానికి రూ.500 బోనస్, డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రోత్సాహం, ఉద్యానపంటల సాగుకు ప్రోత్సాహకాలు, మార్కెటింగ్ వ్యవస్థ ఆధునీకరణపై మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిసింది. అదేవిధంగా సాగునీటి రంగానికి ప్రాధాన్యం, ప్రాజెక్టుల సత్వర పూర్తి అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. అలాగే విద్యాకమిషన్, వ్యవసాయ కమిషన్ల ఏర్పాటుపై కూడా చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

## 65 శాతం రిజర్వేషన్లు రద్దు..

- పాట్నా హైకోర్టు సంచలన తీర్పు

**ఢిల్లీ, జూన్ 20 (ప్రజాస్వరం) :** పాట్నా హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. బీహార్‌లో 65 శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తున్నట్లు కీలక తీర్పు వెలువరించింది. గతేడాది బిహార్ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను 65 శాతానికి పెంచింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. ఈనేపథ్యంలో విచారణ జరిపిన పట్నా హైకోర్టు, 65 శాతానికి రిజర్వేషన్ల పెంపు రాజ్యాంగ విరుద్ధమని తాజాగా తీర్పు వెలువరించింది. బిహార్‌లో కులగణన తర్వాత విద్య, ఉద్యోగ రంగాల్లో కల్పిస్తున్న రిజర్వేషన్లను పెంచుతూ సవరణ బిల్లును తీసుకొచ్చారు. రాష్ట్ర అసెంబ్లీ, రాష్ట్రపతి ఆమోదం తర్వాత ఎస్సీలు, ఎస్టీలు, ఇతర వెనకబడిన, అణగారిన వర్గాల రిజర్వేషన్లు 50 శాతం నుంచి 65 శాతానికి పెరిగాయి. ఆర్థికంగా వెనకబడినవారిని ఉద్దేశించిన 10శాతం రిజర్వేషన్లు కలిపి రిజర్వేషన్లు 75శాతానికి చేరాయి. అయితే, ఈ పెంపుపై కొన్నివర్గాల నుంచి అభ్యంతరం వ్యక్తమైంది.

## ఏపీ నూతన డీజీపీగా ద్వారకా తిరుమలరావు

అమరావతి, జూన్ 20 (ప్రజాస్వరం) : ఆంధ్రప్రదేశ్ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి ద్వారకా తిరుమలరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఏపీఎస్ ఆర్టీసీ ఎండీగా కొనసాగుతున్న ఆయనను డీజీపీగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు డీజీపీగా హరీశ్ కుమార్ గుప్తా ఉన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం రోజు ట్రాఫిక్ సరిగా నియంత్రించలేదనే విమర్శల నేపథ్యంలో ప్రభుత్వ నూతన డీజీపీని నియమించడం గమనార్హం.